

# లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

- **రాజీ మార్గమే రాజమార్గం.. ఎస్పీ డి. జానకి**

**ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 5 (ఆశ్వి అప్డేట్స్):**

కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని, రాజీ మార్గంలో కేసులను సత్వరమే పరిష్కరించుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 12న నిర్వహించనున్న లోక్ అదాలత్‌పై శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో కోర్టు లైజన్, డ్యూటీ అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. 'రాజీ మార్గమే రాజమార్గం' అనే విషయాన్ని కక్షిదారులకు వివరించి, ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వచ్ఛందంగా కేసుల పరిష్కారానికి వచ్చేలా కౌన్సిలింగ్ ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగడం వల్ల సమయం, డబ్బు వృథా కావడంతో పాటు మానసిక ప్రశాంతత కూడా దెబ్బతింటుందని తెలిపారు. చట్టపరమైన నిబంధనలకు లోబడి గరిష్ట సంఖ్యలో కేసుల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించారు. లోక్ అదాలత్‌ను దృష్టిలో ఉంచుకుని చార్జిషీట్ల దాఖలు, సమన్లు, వారెంట్ల అమలు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.



# ముఖ్యమంత్రి పర్యటన ప్రశాంతంగా ముగింపు

- **పోలీస్ అధికారులకు, సిబ్బందికి అభినందనలు**

**వికారాబాద్, సెప్టెంబర్ 5 (ఆశ్వి అప్డేట్స్):**

తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గ పర్యటన పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య విజయవంతంగా, ప్రశాంతంగా ముగిసింది. చార్మినార్ జోన్ డీఐజీ చందన దీప్తి, ఐపీఎస్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు చేపట్టారు.

ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్, జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, ఐపీఎస్ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పర్యటనను విజయవంతంగా నిర్వహించడంలో ప్రతి ఒక్క అధికారి, సిబ్బంది సమన్వయంతో, క్రమశిక్షణతో, అప్రమత్తంగా విధులు నిర్వర్తించారని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ప్రశాంతంగా, సజావుగా ముగిసేందుకు కృషి చేసిన పోలీస్ సిబ్బంది సమిష్టి కృషి అభినందనీయమని పేర్కొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 99 మంది పట్టుబాటు

- **రూ.3.45 లక్షల జరిమానా**
- **లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 75 మందికి రూ.2.31 లక్షల ఫైన్**

**సిద్దిపేట, సెప్టెంబర్ 5 (ఆశ్వి అప్డేట్స్):**




సిద్దిపేట ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 99 మంది, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 75 మంది పట్టుబడ్డారు. మొత్తం 174 కేసుల్లో వాహనదారులకు రూ.5,76,500 జరిమానా విధించారు. ట్రాఫిక్ సీఐ చెట్టుక్రింది ముత్యం రాజు ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో పట్టుబడిన 99 మందిని సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరచగా రూ.3,45,500 జరిమానా విధించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 75 మందికి రూ.2,31,000 జరిమానా విధించారు. ఈ సందర్భంగా సీఐ ముత్యం రాజు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌తో తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు ఉంటుందని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.



# ఉత్తమ ఉపాధ్యాయుడిగా కె. సందీప్ రెడ్డికి పురస్కారం

- **నేరడ గ్రామానికి గర్వకారణంగా నిలిచిన ఉపాధ్యాయుడు**

**యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 5 (ఆశ్వి అప్డేట్స్):**

నేరడ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు శ్రీ కె. సందీప్ రెడ్డి ఉత్తమ ఉపాధ్యాయుడు పురస్కారం అందుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వర్తిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించడంతో పాటు క్రమశిక్షణ, మంచి విలువలు, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. సందీప్ రెడ్డి విద్యార్థులను కేవలం విద్యాపరంగా మాత్రమే కాకుండా, భవిష్యత్ సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారని అభినందనలు తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయుడు పురస్కారం అందుకున్న సందర్భంగా నేరడ గ్రామస్థులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి విద్యారంగానికి మరింత సేవలందించాలని ఆకాంక్షించారు.






# సీఎం సభకు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.. ఘన స్వాగతం

- **బ్రహ్మరథం పట్టిన నకిరేకల్ నియోజకవర్గ ప్రజలు.. భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు**

**నకిరేకల్, సెప్టెంబర్ 5 (ఆశ్వి అప్డేట్స్):**

ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పాల్గొన్న సభకు హాజరైన నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి నియోజకవర్గ ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఆయన సభా ప్రాంగణానికి చేరుకున్న సమయంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉత్సాహంగా స్వాగతం పలికారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రాక సందర్భంగా నకిరేకల్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సభకు చేరుకున్నారు. ఆయనకు మద్దతుగా నినాదాలు చేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. సభా ప్రాంగణం వద్ద సందడి వాతావరణం నెలకొంది.

**అభివృద్ధి కార్యక్రమాలపై ఆసక్తి**

ముఖ్యమంత్రి పాల్గొన్న సభ కావడంతో నకిరేకల్ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో ఆసక్తి నెలకొందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు, ప్రాజెక్టులు తీసుకురావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి లభించిన స్వాగతం కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఈ సందర్భంగా పలువురు నాయకులు పిలుపునిచ్చారు. సీఎం సభకు నకిరేకల్ నియోజకవర్గం నుంచి భారీగా ప్రజలు తరలిరావడం, ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలకడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# మఠంపల్లిలో బైక్ స్టంట్లు: యువకుడు అరెస్ట్, బైక్ సీజ్

**మఠంపల్లి, సెప్టెంబర్ 5 (ఆశ్వి అప్డేట్స్):**

సూర్యాపేట జిల్లా మఠంపల్లి ప్రధాన సెంటర్‌లో నడిరోడ్డుపై ప్రమాదకరంగా బైక్ స్టంట్లు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన పర్వతం గోపీచంద్ (19)ను మఠంపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. జాన్‌పాడు-మట్టపల్లి రోడ్డుపై ఒంటి చక్రంతో బైక్ నడుపుతూ విన్యాసాలు చేస్తున్న అతడిని అదుపులోకి తీసుకుని, బైక్‌ను సీజ్ చేశారు. యువకుడితో పాటు బైక్ ఇచ్చిన అతని మామపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. రద్దీ ప్రాంతాల్లో ప్రమాదకర బైక్ స్టంట్లు చేస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ చారమందరాజు హెచ్చరించారు.



స్టంట్లు చేస్తున్న యువకుడిపై వెంటనే చర్యలు తీసుకున్న ఎస్ఐ ప్రవీణ్ కుమార్, పోలీస్ సిబ్బందిని స్థానికులు అభినందించారు.






# గణేష్ ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

- **రౌడీషీటర్లపై నిరంతరం నిఘా**
- **వీడియో కాన్ఫరెన్స్‌లో పోలీస్ కమిషనర్ సునీల్ దత్**

**ఖమ్మం, సెప్టెంబర్ 5 (ఆశ్వి అప్డేట్స్):**

రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు, విగ్రహాల నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అధికారులను ఆదేశించారు. శనివారం పోలీస్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. గణేష్ మండపాల నిర్వాహకులతో సమన్వయం చేసుకుని ముందస్తు ప్రణాళిక రూపొందించాలని, నిమజ్జన మార్గాలు, ప్రదేశాలను ముందుగానే పరిశీలించి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని సూచించారు. రద్దీ ప్రాంతాల్లో అదనపు బందోబస్తు ఏర్పాటు చేసి, అవసరమైన చోట ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేయాలన్నారు.

విగ్రహాల ఊరేగింపుల్లో డీజేలు, అధిక శబ్దం, రెచ్చగొట్టే నినాదాలు, మద్యం సేవించి పాల్గొనే వారిపై నిఘా ఉంచాలని ఆదేశించారు. ఉత్సవ కమిటీలు, నిర్వాహకులతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచడంతో పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను ముందుగానే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తించే వారిని ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# రేవంత్ సర్కార్ గద్దె దిగే వరకు పోరాటం

- **22-ఏ బాధితులకు అండగా బీజేపీ దీక్ష.. ప్రభుత్వంపై ఈటల రాజేందర్ తీవ్ర విమర్శలు**
- **"రెండేళ్లు కాదు.. వెయ్యి కేసులు పెట్టినా వెనక్కి తగ్గం"**
- **"పేదల భూములు, ఇళ్ల జోలికి వస్తే వదిలిపెట్టం"**

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (ఆశ్వి అప్డేట్స్):**

22ఏ నిషేధిత జాబితాలో భూములను చేర్చడాన్ని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. ప్రజల భూములు, పేదల ఇళ్ల విషయంలో ప్రభుత్వం అన్యాయం చేస్తే ఎంతటి పోరాటానికైనా సిద్ధమని అన్నారు. ఇందిరాపార్క్ వద్ద బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిర్వహించిన దీక్ష కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించకుండా పేదల భూములు, ఇళ్లపై చర్యలకు దిగుతోందని ఈటల ఆరోపించారు. "ప్రజల ఉసురు పోసుకుంటున్న రేవంత్ సర్కార్ గద్దె దిగే వరకు విశ్రమించేది లేదు" అని అన్నారు.

**22-ఏపై తీవ్ర అభ్యంతరం**

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 22ఏ కారణంగా పెద్ద సంఖ్యలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈటల పేర్కొన్నారు. 22ఏ జాబితా విషయంలో ప్రభుత్వ పెద్దలపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. 22ఏ జాబితాలో భూములను చేర్చే అధికారం ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. సంబంధిత ఉత్తర్వులు, అధికారుల మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలను ప్రజల ముందుంచుతామని చెప్పారు. నర్సాపూర్‌లోనే వేలాది మంది రైతుల భూములు ఈ జాబితాలోకి వెళ్లాయని పేర్కొంటూ, సమస్య తీవ్రతను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని డిమాండ్ చేశారు. "22ఏను సమర్థించడం కాదు.. బాధితుల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలి" అని ఈటల స్పష్టం చేశారు.

**అధికారులకు ఈటల హెచ్చరిక**

ప్రభుత్వ ఆదేశాలను అమలు చేసే అధికారులు రాజ్యాంగంపై చేసిన ప్రమాణాన్ని గుర్తుంచుకోవాలని ఈటల సూచించారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ప్రజలకు అన్యాయం చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో ఇళ్ల కూల్చివేత చర్యలను ప్రస్తావిస్తూ, పేదల ఇళ్లను కాపాడేందుకు ప్రజలు ఎండలోనూ పోరాడారని చెప్పారు. ప్రజల ఆస్తులు, నివాసాల విషయంలో అధికారులు మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని కోరారు.

**"పేదల జోలికి వస్తే వదిలిపెట్టం"**

హైడ్రా చర్యలను ప్రస్తావిస్తూ పేదల ఇళ్ల కూల్చివేతపై ఈటల తీవ్రంగా స్పందించారు. గాజులరామారం, ఫణిగిరి కాలనీ, మహేంద్రహిల్స్ తదితర ప్రాంతాల్లో పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ.. "నాపై వ్యక్తిగతంగా ఎలాంటి కోపం లేదు. కానీ మా పేదల జోలికి వస్తే మాత్రం వదిలేది లేదు" అని అన్నారు. పేదల ఇళ్లను కూల్చివేస్తే బీజేపీ ప్రజల తరఫున పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

**భూముల విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి**


ప్రభుత్వ భూములు, పారిశ్రామిక సంస్థలకు చెందిన విలువైన భూముల విషయంలోనూ ఈటల పలు ఆరోపణలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూముల వ్యవహారాలను ప్రస్తావిస్తూ, ప్రస్తుత ప్రభుత్వం వాటిని కొనసాగిస్తోందని విమర్శించారు. పుప్పాలగూడలో భూముల రికార్డుల్లో రాత్రికి రాత్రే మార్పులు చేస్తున్నారని ఆరోపించారు. ఆయా భూముల వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై విమర్శలు**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి వ్యవస్థ కారణంగా పేదలు, రైతులు భూముల హక్కులకు సంబంధించిన సమస్యలు ఎదుర్కొన్నారని ఈటల విమర్శించారు. గత ప్రభుత్వ విధానాలను ప్రస్తుత ప్రభుత్వం కూడా కొనసాగిస్తోందని ఆరోపించారు. "దుర్మార్గమైన బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాదు. కాంగ్రెస్‌ను పాతాళానికి తొక్కడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. తెలంగాణలో ధర్మపాలన కోసం బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారు" అని ఈటల అన్నారు.

**"వెయ్యి కేసులు పెట్టినా పోరాటం ఆగదు"**

బీజేపీ నేతలు, కార్యకర్తలపై ఇప్పటికే అనేక కేసులు పెట్టారని, ఇంకా వెయ్యి కేసులు పెట్టినా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం ఆపేది లేదని ఈటల అన్నారు. ప్రజల హక్కుల కోసం అవసరమైతే న్యాయపరమైన పోరాటం చేస్తామని, బాధితులు ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను ఆశ్రయించినా వారికి అండగా ఉంటామని తెలిపారు. ప్రభుత్వ చర్యలను అడ్డుకునే క్రమంలో పోలీసులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకునే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. "రక్తం చిందించైనా ప్రభుత్వ దుర్మార్గాలను అడ్డుకుంటాం" అంటూ ఈటల రాజేందర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. భూముల సమస్యలపై బాధితులందరినీ ఏకం చేసి ఉద్యమాన్ని మరింత విస్తృతం చేస్తామని తెలిపారు.










# కేసీఆర్ ఫాంహౌజ్ వీడి అసెంబ్లీకి రావాలి

- నమ్మి ఓట్లేసిన గజ్వేల్ ప్రజల సమస్యలు పరిష్కరించాలి
- కేటీఆర్ గత చరిత్ర తెలుసుకుని మాట్లాడాలి
- సోనియా తెలంగాణ ఇవ్వకుంటే మీ పరిస్థితి ఏమిటి?

**గజ్వేల్, సెప్టెంబర్ 5 (ఆశ్వి అప్డేట్స్):**

మాజీ సీఎం, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌజ్ వీడి అసెంబ్లీకి వచ్చి, తనను నమ్మి ఓట్లేసిన గజ్వేల్ ప్రజల సమస్యలపై పోరాడాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు అన్నారు. సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తూముకుంట అంక్షారెడ్డి ఆధ్వర్యంలో గజ్వేల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.
కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేసే ముందు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గత చరిత్ర తెలుసుకోవాలని హనుమంతరావు సూచించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో సోనియా గాంధీ కీలక పాత్ర పోషించారని, అప్పట్లో కేసీఆర్ కుటుంబం ఆమెను ప్రశంసించి, ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసం విమర్శలు చేయడం సరికాదన్నారు. గజ్వేల్ ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన కేసీఆర్ దర్శనం కష్టంగా మారిందని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీలో గళమెత్తి నిధులు సాధించాలని, అందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం సహకరించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు.
కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తోందని అన్నారు. పెట్టుబడుల కోసం సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలు చేపడుతుంటే బీఆర్ఎస్, బీజేపీ నేతలు రాజకీయ విమర్శలు చేయడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం రాజకీయాలకు అతీతంగా సహకరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.
కాంగ్రెస్ చరిత్రను ఎవరూ చెరిపేయలేరని, రానున్న కాలంలోనూ రాష్ట్రంలో కాంగ్రెస్ బలంగా ఉంటుందని హనుమంతరావు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్లు నరేందర్‌రెడ్డి, విరుపాక శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ నాయకులు నాయిని యాదగిరి, నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, సర్పంచుల ఫోరం నాయకులు, మండలాల బాధ్యులు, మైనార్టీ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ ప్రసాద్ మెమోరియల్ స్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**ఖమ్మం, సెప్టెంబర్ 5 (ఆశ్వి అప్డేట్స్):**

ఖమ్మంలోని శ్రీకృష్ణ ప్రసాద్ మెమోరియల్ పోలీస్ సంక్షేమ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్‌పర్సన్ నిష్టా శర్మ మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠ్యాంశాలు బోధించిన సోహిత్, ఆసియా ఫిర్దోస్, హర్షితలకు బహుమతులు అందజేశారు. ఏఆర్ ఏసీపీ నర్సయ్య, ఆర్ఐ కామరాజు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రాజు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.






## ఇందిరా మహిళా శక్తి సోలార్ యూనిట్లకు భూమిపూజ

**ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 5 (ఆశ్వి అప్డేట్స్):**

మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా కొల్లాపూర్ మండలం అంకిరావుపల్లి, సింగోటం గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న 800 కిలోవాట్ల 11 కేవీ సోలార్ యూనిట్ల నిర్మాణ పనులకు శనివారం భూమిపూజ నిర్వహించారు. మంత్రులు డాక్టర్ సీతక్క, జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పాల్గొని పనులకు శంకుస్థాపన చేశారు. సోలార్ యూనిట్ల ద్వారా మహిళా సంఘాలకు శాశ్వత ఆదాయ మార్గాలు ఏర్పడి, గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారతకు దోహదపడుతుందని మంత్రులు తెలిపారు. అంతకుముందు అంకిరావుపల్లిలో రూ.17.78 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న హ్యామ్ రోడ్డు నిర్మాణ పనులకు కూడా మంత్రులు, ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు.

## సెయింట్ పీటర్స్ హైస్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

- ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించిన విద్యార్థులు

**గజ్వేల్, సెప్టెంబర్ 5 (ఆశ్వి అప్డేట్స్):**

గజ్వేల్-తూప్రాన్ రోడ్డులోని సెయింట్ పీటర్స్ హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేడుకల్లో విద్యార్థులు జానపద గేయాలు, నృత్యాలతో అలరించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతున్న ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. సమాజ నిర్మాణంలో, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సేవియర్, ప్రిన్సిపాల్ ఫెలిక్స్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.






## కుప్పానగర్ జడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా గురుపూజోత్సవం

- ఉపాధ్యాయులకు విద్యార్థుల ఘన సన్మానం

**జహీరాబాద్, సెప్టెంబర్ 5 (ఆశ్వి అప్డేట్స్):**


ఝరాసంగం మండలం కుప్పానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని పాఠశాలలో ఉత్సవ వాతావరణం నెలకొంది.తొలుత రాధాకృష్ణన్ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉపాధ్యాయుల వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువాలు, పూలమాలలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. గురువుల సేవలను కొనియాడుతూ విద్యార్థులు ప్రసంగాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కరీంనగర్ జిల్లాలో కేటీఆర్ కారుకు ప్రమాదం

- అలుగునూర్ వద్ద లారీ ఢీ
- ప్రమాద సమయంలో కారులోనే కేటీఆర్.. స్వల్పంగా దెబ్బతిన్న వాహనం

**కరీంనగర్, సెప్టెంబర్ 5 (ఆశ్వి అప్డేట్స్):**

కరీంనగర్ జిల్లా పర్యటనలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రయాణిస్తున్న కారుకు ప్రమాదం జరిగింది. అలుగునూర్ వద్ద కేటీఆర్ కారును లారీ ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో కేటీఆర్ కారులోనే ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనలో కారు స్వల్పంగా దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. కేటీఆర్‌కు ఎలాంటి గాయాలు కాలేదని సమాచారం. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## కేసీఆర్ రాజీనామా చేయాలి.. లేదంటే ఎమ్మెల్యే సభ్యత్వం రద్దు చేయాలి

- ఫామ్‌హౌస్‌కే పరిమితమైన ప్రతిపక్ష నేత అవసరమా?
- రేపు ఇందిరాపార్క్ వద్ద కాంగ్రెస్ మహా నిరసన

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (ఆశ్వి అప్డేట్స్):**



ప్రతిపక్ష నేత కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమై అసెంబ్లీకి హాజరుకాకుండా ప్రజా సమస్యలపై స్పందించడం లేదని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ విమర్శించారు. ప్రజాధనం వృథా అవుతోందంటూ ఆరోపిస్తూ కేసీఆర్ రాజీనామా చేయాలని లేదా ఆయన ఎమ్మెల్యే సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టీపీసీసీ పిలుపు మేరకు సెప్టెంబర్ 6న ఉదయం 9.30 గంటలకు ఇందిరాపార్క్ వద్ద మహా నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎల్బీనగర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో బైక్‌లు, కార్లలో ర్యాలీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నియోజకవర్గ ముఖ్య నేతలు, మాజీ కార్పొరేటర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం ఉదయం 9 గంటలకు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్దకు చేరుకోవాలని సూచించారు.



## మార్కెట్లోకి ఎంజీ హెక్టర్ టోమహాక్ ఎస్‌యూవీ

- ఏడీఏపిటి ప్లాట్‌ఫామ్‌పై రూపొందిన తొలి ఎస్‌యూవీ

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 5 (ఆశ్వి అప్డేట్స్):**

కార్ల మార్కెట్లోకి ఎంజీ హెక్టర్ టోమహాక్ ఎస్‌యూవీ అడుగుపెట్టింది. సికింద్రాబాద్ రాణిగంజ్‌లోని విభ్రాంత్ ఎంజీ షోరూమ్‌లో శనివారం రిటైర్డ్ ఎయిర్ వైస్ మార్షల్ డీకే అవస్థి, విభ్రాంత్ ఎంజీ మేనేజింగ్ డైరెక్టర్ బషీరుద్దీన్ బాబు ఖాన్, సిరాజ్ బాబు ఖాన్‌లతో కలిసి వాహనాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీకే అవస్థి మాట్లాడుతూ.. దేశంలోనే తొలి మల్టీ న్యూ ఎనర్జీ వెహికల్ అడ్వాన్స్‌డ్ డ్రైవ్ ఆర్కిటెక్చర్ ప్లాట్‌ఫామ్ టెక్నాలజీ (ఏడీఏపిటి)పై జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా రూపొందించిన తొలి ఎస్‌యూవీగా హెక్టర్ టోమహాక్ ప్రత్యేకతను సంతరించుకుందని తెలిపారు. అనంతరం విభ్రాంత్ ఎంజీ మేనేజింగ్ డైరెక్టర్ బషీరుద్దీన్ బాబు ఖాన్ వాహనం ధర, వేరియంట్ల వివరాలను వెల్లడించారు. సిరాజ్ బాబు ఖాన్ మాట్లాడుతూ హెక్టర్ టోమహాక్‌లో అందుబాటులో ఉన్న అధునాతన ఫీచర్లు, సాంకేతికత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో షోరూమ్ సిబ్బంది, కస్టమర్లు పాల్గొన్నారు.



## నగరం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం

**నిజాంపేట మండలం, సెప్టెంబర్ 5 (ఆశ్వి అప్డేట్స్):**

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరం గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. నగరం గ్రామంలోని ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అంతంపల్లి సుశీల మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుగ్లోత్ నాజం, పంచాయతీ కార్యదర్శి మొహమ్మద్ ఆరీఫ్ హుస్సేన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి, ఉపాధ్యాయులు వెంకటేష్, కల్పన, స్రవంతి, సోనా, అంగన్‌వాడీ టీచర్ గుగ్లోత్ స్వప్న, విద్యార్థులు పాల్గొన్నారు.

## 108 సిబ్బంది సమయస్ఫూర్తి.. అంబులెన్స్‌లోనే ప్రసవం

- పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన తల్లి.. తల్లీబిడ్డ క్షేమం

**ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 4 (ఆశ్వి అప్డేట్స్):**



108 సిబ్బంది సమయస్ఫూర్తితో ఓ గర్భిణికి అంబులెన్స్‌లోనే సుఖప్రసవం జరిగింది. ఏదుల మండలం గుండావాళ్ల నాయక్ తండాకు చెందిన తుకారం భార్య జయలక్ష్మి (25)కు శనివారం మధ్యాహ్నం 3:25 గంటలకు పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు.
వెంటనే స్పందించిన రేవల్లి 108 అంబులెన్స్ సిబ్బంది జయలక్ష్మిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో పురిటినొప్పులు తీవ్రంగా పెరిగాయి. పరిస్థితి ప్రమాదకరంగా మారడంతో ఈఎంటీ వీరేష్, ఆశా కార్యకర్త సహకారంతో అంబులెన్స్‌లోనే ప్రసవం నిర్వహించారు. జయలక్ష్మి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని సిబ్బంది తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సమయస్ఫూర్తితో వ్యవహరించిన ఈఎంటీ వీరేష్, పైలట్ కిరణ్‌చారిలను కుటుంబ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది అభినందించారు. అనంతరం తల్లీబిడ్డలను ఎంసీహెచ్ ఆసుపత్రిలో చేర్పించారు.



## అభివృద్ధి పనులపై నిరాధార ఆరోపణలు సరికాదు

- బీఆర్ఎస్ నేతల ప్రచారాన్ని ఖండించిన బొప్పన్‌పల్లి పాలకవర్గం

**జహీరాబాద్, సెప్టెంబర్ 5 (ఆశ్వి అప్డేట్స్):**

బొప్పన్‌పల్లి గ్రామంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి, మౌలిక వసతుల పనులు కొనసాగుతున్నాయని సర్పంచ్ అమృత్, ఉపసర్పంచ్ రాములు తెలిపారు. గ్రామ అభివృద్ధిని పట్టించుకోకుండా కొందరు బీఆర్ఎస్ నేతలు రాజకీయ ఉద్దేశాలతో నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఖండించారు. గ్రామంలో ఎల్ఈడీ లైట్లు, నీటి సరఫరా కోసం మోటార్ ఏర్పాటు, నల్లా లీకేజీల మరమ్మతులు, డ్రైనేజీ, మోరీల పనులు చేపట్టినట్లు వివరించారు. ఏవైనా ఆరోపణలకు ఆధారాలు ఉంటే అధికారులకు సమర్పించాలని, సోషల్ మీడియాలో నిరాధార ప్రచారం చేయవద్దని సూచించారు. గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరుతూ, ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వార్డు సభ్యురాలు శిరోమణి, మాజీ సర్పంచ్ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# కుర్చీకే అతుక్కుపోతున్నారా? మీరు డేంజర్ లో పడ్డట్టే..!

ప్రస్తుతం కంప్యూటర్ ఆధారిత ఉద్యోగాలే ఎక్కువ. దాదాపుగా 90 శాతం మంది ఇటువంటి జాబ్స్ చేస్తున్నారు. దీంతో రోజులో ఎక్కువ గంటలు కుర్చీకి అతుక్కుపోవాల్సి వస్తోంది. ఇంట్లో కూడా ఖాళీ సమయం దొరికినప్పుడల్లా అలా సోఫాలో వాలిపోయి టీవీ చూసేస్తున్నారు. వాకింగ్ , ఇతర వర్కవుట్స్ చేసేందుకు పెద్దగా టైమ్ ఉండటం లేదు. అయితే దీని వల్ల చాలా ఆరోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. అవి ఏమిటో ఈ కథనంలో తెలుసుకుందాం. చాలా మంది ఉద్యోగులు 8 నుంచి12 గంటలు కంప్యూటర్ల దగ్గర పనిచేసే వాళ్లు ఉన్నారు.




### కుర్చీలో కూర్చొని పనిచేస్తే సమస్యలు ఇవే..!

ఆఫీస్ పనిచేసే క్రమంలో చాలా సేపు ఒకటే పొజిషన్ లో మనం కుర్చీలో కూర్చుండి పోతాం. అయితే దీనివల్ల శరీరం దిగువ భాగంలో కొవ్వు పేరుకుపోతుందని చెబుతున్నారు. తప్పుడు పద్ధతిలో కుర్చీపై కూర్చొని గంటల తరబడి పని చేయడం వలన ఏకాగ్రత తగ్గుతుందట. ఎందుకంటే అసౌకర్యంగా కూర్చున్నప్పుడు వ్యక్తి దృష్టి పదే పదే ఒకే చోటికి వెళ్తుంది. కాబట్టి సరైన వీపు, చేయి మద్దతుతో కుర్చీపై కూర్చోవాలి. కుర్చీపై కూర్చొని కంప్యూటర్‌లో పని చేసేవారికి.. కీబోర్డ్‌పై నిరంతరం వేళ్లను కదిలించే వారికి చేతులు, భుజాలలో నొప్పి వస్తుంది. రక్త ప్రసరణ కూడా దెబ్బతింటుంది. భుజాలు, పొట్ట, నడుము భాగాల్లో రక్తప్రసరణ సరిగా జరగదు. దీనివల్ల శరీరంలో జలదరింపు, తిమ్మిరి వంటి సమస్యలు వస్తాయి. కుర్చీ మద్దతు ఇవ్వకపోతే, మద్దతు లేకుండా కూర్చొని ఉంటే.. అది నడుము నొప్పిని కలిగిస్తుంది. ఈ నొప్పి మెడ నుంచి మొదలై తోక ఎముక వరకు వెళ్తుందని నిపుణులు చెబుతున్నారు.

### విరుగుడు ఏంటి?

ఒకే పొజిషన్ లో ఎక్కువ సేపు కూర్చోకుండా.. కొద్ది సేపు వాకింగ్ చేయడం బెటర్ అని నిపుణులు చెబుతున్నారు. స్క్రీన్ మీద తధేకంగా చూడకుండా కాసేపు ఇతర వస్తువులు చూడటం బెటర్ అని చెబుతున్నారు. ఇక ప్రతి గంటకు ఒక్కసారైనా బ్రేక్ ఇవ్వాలట. మరి కుర్చిలో కూర్చొని ఉద్యోగం చేసేవారు కచ్చితంగా ఈ టిప్స్ పాటించండి.


# మొటిమలు ఎలా పోగొట్టుకోవాలి.. బెస్ట్ టిప్స్ ఇవే..!



మొటిమలు చాలా మందిని వేధించే సమస్య ఇదే. అందమైన మొహం కూడా మొటిమలతో పాడైపోతుంది. ముఖ్యంగా టీనేజ్ పిల్లలను మొటిమలు ఎక్కువగా వేధిస్తాయి. అసలు ఈ మొటిమలు ఎలా పోగొట్టుకోవాలి? నిపుణులు ఏం చెబుతున్నారు? ఈ కథనంలో తెలుసుకుందాం..

### ఎటువంటి ఆహార పదార్థాలు తీసుకోవాలి?

మొటిమలు రాకుండా ఉండాలంటే ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు అధికంగా ఉండే ఆహారాలను తినాలి. ఒమేగాత్రీ కొవ్వు ఆమ్లాలు చేపలలో అధికంగా ఉంటాయి. ముఖ్యంగా సాల్మన్, సార్డైన్ వంటి చేపల్లో ఒమేగా త్రీ కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. వీటిని తినడం ద్వారా మొటిమలు సమస్యను తగ్గించుకోవచ్చు.



### ఒమేగా 3తోనే సాధ్యం

ఒక అధ్యయనం ప్రకారం మొటిమల బారిన పడిన వారిలో 98% మందిలో ఒమేగా త్రీ కొవ్వు ఆమ్లాల మోతాదు చాలా తక్కువగా ఉన్నట్టు కనిపించింది. ఎప్పుడైతే ఈ కొవ్వు ఆమ్లాలు అధికంగా ఉంటాయో మొటిమలు వచ్చే సమస్య కూడా తగ్గుతుంది. ఒమేగా త్రీ కొవ్వు ఆమ్లాలు ఉండే ఆహారం తినడం వల్ల మానసిక ఆరోగ్యం బాగుంటుంది. చర్మ ఆరోగ్యం, అందం పెరుగుతుంది. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి.



# మీరు వాడుతున్న నెయ్యి.. అసలైనదా? కల్తీదా? ఇలా గుర్తించండి

రిఫైన్డ్ ఆయిల్ తో పోల్చుకుంటే నెయ్యి ఎంతో ఆరోగ్యకరం. అందుకే ప్రస్తుతం చాలా మంది నూనె వాడకాన్ని తగ్గించి నెయ్యి వాడకం పెంచారు. అయితే మనం రోజు తీసుకొనే నెయ్యి మంచిదేనా? అంటే అసలైనదేనా? లేదంటే కల్తీదా? ఈ విషయం కూడా తెలుకోవాలి. నెయ్యి మేలు చేస్తుందని భావించి కల్తీ నెయ్యి వాడితే మనం ఇంకా ప్రమాదంలో పడ్డట్టే. అసలు మనం వాడుతున్న నెయ్యి అసలైనదా? కల్తీదా? ఎలా తెలుసుకోవాలా? ఈ కథనంలో తెలుకుందాం..

### నీటి పరీక్ష

ఒక గాజు గ్లాసులో కొన్ని నీళ్లు తీసుకోవాలి. అనంతరం అందులో కొంత నెయ్యి వేయాలి. అది నీటిపై తేలితే మంచిదని అర్థం, నీటిలో మునిగితే కల్తీనని అర్థం చేసుకోవాలి.



### అయోడిన్ ఎగ్జామినేషన్

ఒక గిన్నెలో కొంత నెయ్యి తీసుకోవాలి. అనంతరం నెయ్యిలో కొన్ని చుక్కల అయోడిన్ వేసి కలపాలి. ఒకవేళ నెయ్యి రంగు మారితే కల్తీ జరిగినట్లు అర్థం చేసుకోవాలి. రంగు మారకపోతే అది అసలైన నెయ్యి అని అర్థం చేసుకోవాలి.




# చాతిలో మంట తగ్గించే టిప్స్ ఇవే..!

ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా అందరూ చాతిలో మంట సమస్యతో బాధపడుతున్నారు. అయితే కొందరికి గ్యాస్ సమస్య వల్ల చాతిలో మంట వస్తూ ఉంటుంది. మరికొందరు ఊపిరితిత్తుల సమస్య వల్ల చాతిలో మంట సమస్యను ఎదుర్కొంటున్నారు. మన ఆహారం, జీవన విధానంలో వచ్చిన మార్పుల కారణంగానే చాతిలో మంట వస్తుందని నిపుణులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఛాతిలో మంట పెద్ద సమస్యగా మారకపోయినా కొన్ని విషయాల్లో మాత్రం చాలా జాగ్రత్తగా ఉండాలని నిపుణులు చెబుతుంటారు.

### లైట్ తీసుకోకండి..

చాతిలో నొప్పి వస్తే ఎట్టి పరిస్థితుల్లో లైట్ తీసుకోవద్దని.. కచ్చితంగా డాక్టర్ ను సంప్రదించాలని వైద్య నిపుణులు కోరుతున్నారు. కొన్ని నేచురల్ టిప్స్ పాటించడం ద్వారా కూడా చెక్ పెట్టొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఛాతిలో మంట రావడానికి ప్రధాన కారణాల్లో సమయానికి భోజనం చేయకపోవడమని నిపుణులు చెబుతున్నారు. భోజనానికి భోజనానికి మధ్య ఎక్కువ గ్యాప్ ఇవ్వడం వల్ల కడుపులో అల్సర్ లెవల్స్ పెరుగుతాయి. ఇది ఛాతిలో మంటకు దారి తీస్తుందని అంటున్నారు. ఒకేసారి ఎక్కువగా భోజనం చేసినా ఈ సమస్య బారిన పడే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. కొంచెం కొంచెం ఎక్కువసార్లు తీసుకోవాలని చెబుతున్నారు.



### తిన్నవెంటనే నిద్రపోతున్నారా?

కొందరు తిన్న వెంటనే పడుకుంటుంటారు. అయితే ఇది కూడా ఛాతిలో మంటకు దారి తీస్తుందని నిపునులు చెబుతున్నారు. తిన్న తర్వాత కనీసం గంట తర్వాతే మంచం ఎక్కాలని సూచిస్తున్నారు. తిన్న తర్వాత కనీసం 15 నిమిషాలు నడవడాన్ని అలవాటు చేసుకోవాలి. నిత్యం వాకింగ్ చేయడం వల్ల కూడా ఈ సమస్య నుంచి బయట పడొచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

# వామ్మో పిస్తా..

## తింటే మంచిదే కానీ.. అతిగా తింటే సమస్య తప్పదు!



పిస్తా గింజలు రుచికరమైనవి మాత్రమే కాదు. ఇవి అనేక ఆరోగ్య ప్రయోజనాలతో నిండి ఉంటాయి. ఈ చిన్న ఆకుపచ్చ కాయలు ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, పీచు, వివిధ విటమిన్లు అలాగే ఖనిజాలకు మంచి మూలం. పిస్తా గింజలు వివిధ ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. కానీ., సంభావ్య ప్రతికూలతలను నివారించడానికి మితంగా తీసుకోవాలి. సమతుల్య ఆహారంలో భాగంగా పిస్తాలను చేర్చడం వలన అవసరమైన పోషకాలు అందుతాయి. మొత్తం ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయి. పిస్తా తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు అలాగే సంభావ్య ప్రతికూలతలు గురించి చూద్దాం.

### పిస్తా గింజల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు..

**పోషకాలు సమృద్ధిగా:**
పిస్తాపప్పులు ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, పీచు, విటమిన్ బి6, థయామిన్, భాస్వరంల మంచి మూలం. వీటిలో ల్యూటిన్, జియాక్సాంటిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. ఇవి కంటి ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉంటాయి.

**గుండె ఆరోగ్యం:**
పిస్తాపప్పులు చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. అలాగే గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. వీటిలో మోనోశాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి మంచివి.

**బరువు నిర్వహణ:**
కేలరీలు ఎక్కువగా ఉన్నప్పటికీ పిస్తాపప్పులు బరువు నిర్వహణలో సహాయపడతాయి. ప్రోటీన్, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వుల కలయిక మీకు సంతృప్తికరంగా ఉండటానికి సహాయపడుతుంది. మొత్తం కేలరీల తీసుకోవడం తగ్గిస్తుంది.

**రక్తంలో చక్కెర నియంత్రణ:**
పిస్తాపప్పులు తక్కువ గ్లైసెమిక్ సూచికను కలిగి ఉంటాయి. అంటే అవి రక్తంలో చక్కెర స్థాయిలను వేగంగా పెంచవు. ఇది డయాబెటిస్ ఉన్నవారికి మంచి చిరుతిండి ఎంపికగా చేస్తుంది.

**కడుపు ఆరోగ్యం:**
పిస్తాలో ఉండే ఫైబర్ కంటెంట్ ఆరోగ్యకరమైన జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది. దీనివల్ల మలబద్ధకాన్ని నివారించవచ్చు. అవి ప్రీబయోటిక్స్ గా కూడా పనిచేస్తాయి. మీ పేగుల్లోని ప్రయోజనకరమైన బ్యాక్టీరియాను పోషిస్తాయి.



### పిస్తా గింజల వల్ల కలిగే సంభావ్య ప్రతికూలతలు..

**అధిక కేలరీలు:**
పిస్తాపప్పులు పోషకాలు పుష్కలంగా ఉన్నప్పటికీ, అవి కేలరీలు కూడా దట్టంగా ఉంటాయి. మితంగా తినకపోతే అధిక వినియోగం బరువు పెరగడానికి దారితీస్తుంది.

**అలెర్జీలు:**
కొందరికి పిస్తా అలెర్జీ కలిగిస్తుంది. దురద, దద్దుర్లు లేదా తీవ్రమైన సందర్భాల్లో అనాఫిలాక్సిస్ వంటి లక్షణాలను అనుభవించవచ్చు. పిస్తాలను తినేటప్పుడు ఏవైనా అలెర్జీ ప్రతిచర్యల గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం.

**పిస్తా ఫంగస్:**
పిస్తాపప్పులు కొన్నిసార్లు అఫ్లాటాక్సిన్ అనే ఫంగస్ తో కలుషితమవుతాయి. ఇది పెద్ద పరిమాణంలో తీసుకుంటే మానవ ఆరోగ్యానికి హానికరం. ఈ ప్రమాదాన్ని నివారించడానికి ప్రసిద్ధ వనరుల నుండి పిస్తాలను కొనుగోలు చేయడం చాలా ముఖ్యం.

**సోడియం కంటెంట్:**
కాల్చిన పిస్తాలలో తరచుగా అదనపు ఉప్పు ఉంటుంది. ఇది అధికంగా తీసుకుంటే అధిక సోడియం తీసుకోవడానికి దోహదం చేస్తుంది. అధిక సోడియం తీసుకోవడం అధిక రక్తపోటు, హృదయ సంబంధ వ్యాధులతో ముడిపడి ఉంటుంది.


**సంభావ్య బరువు పెరుగుట:**
పిస్తా బరువు నిర్వహణలో సహాయపడగలదు. అధిక కేలరీల కంటెంట్ కారణంగా అధిక వినియోగం బరువు పెరగడానికి దారితీస్తుంది. పిస్తాపప్పులు తినేటప్పుడు భాగ నియంత్రణ సాధన చేయడం చాలా ముఖ్యం.




## పిల్లలు ఎక్కువ మొబైల్ చూస్తున్నారా..?

# అయితే జాగ్రత్త సుమీ..

నేటి ఆధునిక ప్రపంచంలో సాంకేతికత మన రోజువారీ జీవితంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా, పిల్లలు స్మార్ట్ఫోన్లు, టాబ్లెట్లు ఇంకా ఇతర మొబైల్ పరికరాలు ఇట్టే లభించే డిజిటల్ యుగంలో పెరుగుతున్నారు. ఈ పరికరాలు విద్య, వినోదం పరంగా ప్రయోజనకరంగా ఉన్నప్పటికీ, పిల్లలు వాటిని అధికంగా ఉపయోగించినప్పుడు పరిగణించవలసిన ఆరోగ్య ప్రభావాలు కూడా ఉన్నాయి. పిల్లలు ఎక్కువ మొబైల్ పరికరాలను ఉపయోగించడం వల్ల కలిగే ప్రధాన ఆరోగ్య ప్రభావాలలో ఒకటి వారి శారీరక ఆరోగ్యంపై ప్రభావం. అధిక స్క్రీన్ సమయం కంటి ఒత్తిడి, మెడ నొప్పి, తలనొప్పి వంటి సమస్యలకు దారితీస్తుంది. పిల్లలు తమ పరికరాలపై ఎక్కువసేపు సమయం గడపడం వల్ల అనేక సమస్యలను ఎదురుకోవలిసి ఉంటుంది. ఇంకా, మొబైల్ పరికరాలను ఉపయోగించడం నిశ్చల స్వభావం శారీరక శ్రమ లేకపోవటానికి దోహదం చేస్తుంది. ఇది మొత్తం ఆరోగ్యం, శ్రేయస్సును కాపాడుకోవడానికి అవసరం. ఇది దీర్ఘకాలంలో ఊబకాయం, గుండె జబ్బులు, ఇతర దీర్ఘకాలిక పరిస్థితుల ప్రమాదాన్ని పెంచుతుంది.శారీరక ఆరోగ్య ప్రభావాలతో పాటు, అధిక స్క్రీన్ సమయం పిల్లల మానసిక ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. మొబైల్ ఎక్కువ చూడడం వల్ల ఆందోళన, నిరాశ, పేలవమైన నిద్ర నాణ్యత వంటి సమస్యల మధ్య సంబంధాన్ని అధ్యయనాలు చూపించాయి. తెరలకు నిరంతరం గురికావడం పిల్లల సిర్కాడియన్ లయలకు అంతరాయం కలిగిస్తుంది. ఇది తగినంత విశ్రాంతి పొందే వారి సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తుంది.







## దోసకాయ తింటే

# ఇన్ని మార్పులా..?

గత కొన్ని సంవత్సరాలనుండి దోసకాయలు సలాడ్లు, శాండ్విచ్ల కోసం బాగా ప్రజాదరణ పొందాయి. కానీ వీటిలో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయని మీకు తెలుసా..? దోసకాయలు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందించగల బహుముఖ, పోషకమైన కూరగాయ. బరువు తగ్గడానికి సహాయపడటం నుండి జీర్ణ ఆరోగ్యానికి తోడ్పడటం, ప్రకాశవంతమైన చర్మాన్ని ప్రోత్సహించడం వరకు మీ సాధారణ ఆహారంలో దోసకాయలు చేర్చడానికి అనేక కారణాలు ఉన్నాయి. దోసకాయలు క్రమం తప్పకుండా తినడం వల్ల బరువు తగ్గడంలో వాటి పాత్రతో సహా మీ ఆరోగ్యాన్ని మెరుగుపరచగల వివిధ మార్గాలను ఒకసారి చూద్దాం.

**హైడ్రేషన్, అవసరమైన పోషకాలు :**
దోసకాయలు 95శాతం నీటితో కూడి ఉంటాయి. ఇవి ముఖ్యంగా వేసవి రోజుల్లో హైడ్రేటెడ్ గా ఉండటానికి అద్భుతమైన ఎంపిక. దోసకాయలు వాటి అధిక నీటి కంటెంట్ తో పాటు, విటమిన్ కె, విటమిన్ సి, పొటాషియం, మెగ్నీషియం వంటి అవసరమైన పోషకాలకు కూడా మంచి మూలం. ఈ పోషకాలు మొత్తం ఆరోగ్యం, శక్తిని కాపాడుకోవడానికి ముఖ్యమైనవి.

**జీర్ణ ఆరోగ్యం:**
దోసకాయలు ముఖ్య ఆరోగ్య ప్రయోజనాల్లో ఒకటి జీర్ణ ఆరోగ్యానికి తోడ్పడే వాటి సామర్థ్యం. దోసకాయలలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది క్రమం తప్పకుండా ప్రేగు కదలికలను ప్రోత్సహించడానికి, మలబద్ధకాన్ని నివారించడానికి సహాయపడుతుంది. దోసకాయల్లో అధిక నీటి శాతం కూడా జీర్ణక్రియకు సహాయపడుతుంది. ఉబ్బరం, అజీర్ణాన్ని తగ్గించడానికి సహాయపడుతుంది.

**బరువు తగ్గడం:**
కొన్ని అదనపు కేజల శరీర బరువు తగ్గించాలని కోరుకునే వారికి దోసకాయలు మీ ఆహారంలో విలువైన అదనంగా ఉంటాయి. దోసకాయల్లో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఇవి చాలా కేలరీలు తీసుకోకుండా కడుపు నింపడానికి గొప్ప ఎంపికగా ఉంటాయి. అదనంగా, దోసకాయలలోని ఫైబర్ కంటెంట్ మిమ్మల్ని పూర్తిగా, సంతృప్తిగా ఉంచడానికి సహాయపడుతుంది. ముఖ్యంగా అతిగా తినే అవకాశాన్ని తగ్గిస్తుంది.

**యాంటీఆక్సిడెంట్ గుణాలు:**
దోసకాయలు బీటాకెరోటిన్, ఫ్లేవనాయిడ్స్ వంటి యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉంటాయి. ఇవి శరీరాన్ని ఆక్సీకరణ ఒత్తిడి నుండి రక్షించడానికి, శరీరంలోని వాపును తగ్గించడానికి సహాయపడతాయి. ఈ యాంటీఆక్సిడెంట్లు గుండె జబ్బులు, మధుమేహం, కొన్ని రకాల క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి.

**చర్మ ఆరోగ్యం:**
దోసకాయలు వాటి అంతర్గత ఆరోగ్య ప్రయోజనాలతో పాటు, మీ చర్మానికి కూడా అద్భుతాలు చేయగలవు. దోసకాయలు వాటి ఉపశమనం, హైడ్రేటింగ్ లక్షణాలకు ప్రసిద్ధి చెందాయి. ఇవి చర్మ సంరక్షణ ఉత్పత్తులలో ఒక ప్రసిద్ధ పదార్థంగా మారాయి. దోసకాయలు క్రమం తప్పకుండా తినడం వల్ల మీ చర్మం యొక్క మొత్తం రూపాన్ని మెరుగుపరచడానికి, వాపును తగ్గించడానికి, ఆరోగ్యకరమైన ప్రకాశాన్ని ప్రోత్సహించడానికి సహాయపడుతుంది.



PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in SHOBHA PUBLICATION'S